
# సీరియల్

కథ

ఎ. సుధీర్

విజయాన్ని, మత్తునీ పక్కపక్కనే పెడితే మత్తుకన్నా ప్రమాదకరమైంది విజయం. మత్తైనా మరోసారి మారవచ్చు గానీ, విజయాన్ని ఒక్కసారి అనుభవిస్తే మరోసారి ఓటమిని అంగీకరించలేరు.

అలాంటి విజయాన్ని, మత్తులో రంగరించి ఒంటరిగా ఆస్వాదిస్తున్నాడు శరత్. బాటిల్‌లోని ఆనందాన్ని గ్లాస్‌లోకి వంపి, కొద్దికొద్దిగా సిప్ చేస్తూ టీవీ చూస్తున్నాడు. రెండు నిమిషాల యాడ్స్ తర్వాత సీరియల్ మొదలయింది. అతను రాసిన సీరియల్ 'పతివ్రత' వందవ ఎపిసోడ్ ఆరోజు. వరుసగా అతని మూడో సీరియల్ ఆ ఘనతని సాధించింది. అదీ ఆనందం. అతని భార్య పురిటికి వెళ్ళటంతో ఒంటరిగా విజయాన్ని ఆస్వాదిస్తున్నాడు శరత్. టీవీలో ఆరోజు సీరియల్ బదులు నటీనటులు, టెక్నీషియన్స్‌తో ఇంటర్వ్యూలను ప్రసారం చేస్తున్నారు. తర్వాత స్క్రీన్ మీద శరత్ ప్రత్యక్షమయ్యాడు. ఆదరిస్తున్న ప్రేక్షకులకి కృతజ్ఞతలు, తన అనుభవాలు చెప్తున్నాడు. గంటసేపు స్పెషల్ ప్రోగ్రాం అయిపోగానే ఫోన్ మోగింది.



ఏడుకొండలు చేశాడు "ఏమయ్యా, కంగ్రాట్స్" అన్నాడు. అతనే శరత్ మూడుసీరియళ్ళ నిర్మాత. "చూస్తున్నావ్ గదా, ఎంత క్రేజొచ్చిందో మన సీరియల్‌కి. ఇంకో పది ఎపిసోడ్లలో ముగిస్త నంటున్నవ్. మరోసారి ఆలోచించు. డైరెక్టర్ కూడ అంటున్నాడు గద మరో 25 ఎపిసోడ్లన్న పెంచాల్నని" అన్నాడు. మరోసారి ఆ విషయాన్ని కదపటంతో కొంచెం విసుగ్గా అన్నాడు శరత్. "ఏడుకొండలుగారూ, ముహూర్తం రోజు నుంచీ చెప్తున్నాను మన సీరియల్ 110 ఎపిసోడ్లే అని, మళ్ళీ పాతిక ఎపిసోడ్లు పెంచమంటారేంటీ?"

"అది కాదయ్యా బాబూ, మన ముందు సీరియళ్ళకి కూడ లేని క్రేజు దీనికొచ్చె. జనం ఎగబడి చూస్తుండె. అనుకున్నదింతే అని ఇప్పుడే ఆపితే బంగారు గుడ్లు పెట్టే బాతుని చంపుకున్నట్టే గద?" కొంచెం బతిమాలుతున్నట్టుగా అన్నాడు ఏడుకొండలు.

"అనుకున్నట్టే తీసాం కాబట్టే జనం ఎగబడి చూస్తున్నారు. ఇంకా సాగదీస్తే బిగి తగ్గిపోద్ది, ఆ తరువాతెవరూ చూడరు. ఇప్పుడు ఆపితే కనీసం మంచి పేరయినా మిగుల్తుంది" అన్నాడు శరత్.

అవతలి వైపు మౌనం. శరత్‌కి తెలుసు ఏడుకొండలి మనస్తత్వం. అతను అనుకున్నాడంటే అది జరగాలి, కానీ ఈ విషయం తనకిష్టంలేని పనికాబట్టే ఇన్నిసార్లు చెప్పాడు తరువాత అతనిష్టం.

రెండు నిమిషాల తర్వాత అన్నాడు ఏడుకొండలు "ఈ సీరియల్‌ని ఇక్కడే ఆపటం నాకిష్టం లేదు. నీకంతగా ఇష్టం లేక రాయలేననుకుంటే చెప్పు. వేరేవాళ్ళని చూద్దాం. తొందరేం లేదు. రేప్పొద్దున్న ఆఫీస్‌కి వచ్చేటప్పటికి ఆలోచించు. ఎకౌంట్ సెటిల్ చేయాలా, స్టోరీ డిస్కషన్స్‌కి రూమ్ బుక్ చేయాలా, నీ యిష్టం వుంటామరి" అని పెట్టేశాడు.

పరిస్థితులు ఇలా రావచ్చని ముందే ఊహించాడు శరత్. అవసరమైతే చివరి అస్త్రాన్ని ఉపయోగిస్తాడని తెలుసు. అయినా ఇప్పుడు తను కేవలం తన ఆనందంకోసం రాసుకునే రచయిత కాదు. తన ప్రొడక్ట్‌ని జనానికమ్మే వ్యాపారవేత్త. మనుగడ కావాలంటే కొంత??? సంతృప్తిని కోల్పోకతప్పదు.

క్షణం క్రితం ఉన్న ఆనందం ఫోన్‌లో మాట్లాడగానే ఆవిరయ్యింది. ఇంతకుముందు ఆనందాన్ని పెంచడానికి తాగిన మందు ఇప్పుడు విషాదాన్ని పంచుకోవడానికి సిద్ధపడినట్టుగా వుంది. చిన్నగా నవ్వుకొని మరో పెగ్గు పోసుకొనబోతుంటే కాలింగ్‌బెల్ మోగింది. గ్లాస్ పక్కన పెట్టి వెళ్ళి తలుపు తీసాడు 'మాలినీ' అన్నాడు ఆశ్చర్యంగా శరత్.

"లోనికి రానిస్తే ఇద్దరం కలిసి ఆశ్చర్యపోవచ్చు" నవ్వుతూ అంది మాలిని. "సారీ, లోపలికి రా" అంటూ లోపలికి దారి తీశాడు.

బాటిల్స్, ఇతర సరంజామా అంతా సర్దబోతుంటే అంది మాలిని "నువ్వు తాగితే నాకేం అభ్యంతరం లేదు శరత్. ఆడ కంపెనీ నీకిష్టం లేకపోతే వదిలెయ్. నాకు మాత్రం ఏదయినా సాఫ్ట్ డ్రింక్ యివ్వు" అంది.

ఫ్రిజ్‌లోంచి కూల్‌డ్రింక్ తీస్తూ అన్నాడు "నువ్వు మా యింటికి రావటం ఆశ్చర్యంగా వుంది. షూటింగున్నట్టుంది కదా ఈరోజు. అయిపోగానే ఇటే వస్తున్నావా?" మాలిని 'పతివ్రత' సీరియల్ హీరోయిన్. "అవును, ఈరోజు క్లైమాక్స్ కొండ మీదినుంచి దూకేసీన్. చాలా నేచురల్‌గా వచ్చింది" అంది. ఆమె కంఠంలో చిన్న జీర.

అది గమనించకుండా ఆమె చేతికి కూల్‌డ్రింక్ ఇచ్చి తను పెగ్ తీసుకుంటూ అన్నాడు శరత్ "భోంచేసావా? ఏమయినా చేయమంటావా?" అతనికీ, మాలినికీ మంచి రిలేషన్ వుంది. ఇండస్ట్రీకొచ్చిన కొత్తలో శరత్‌కి చాలా మోరల్ సపోర్టిచ్చింది మాలిని. అందుకే ఆమెపట్ల అభిమానంగా వుంటాడు.

సూటిగా అసలు విషయం చెప్పింది మాలిని. "శరత్, నేను ఈరోజు నుంచి నటించటం మానేస్తున్నాను" అంది. ఏం విన్నాడో అర్థంకాక ఒక్క క్షణం అలా చూస్తుండిపోయాడు శరత్... నవ్వాడు కానీ ఆమె సీరియస్‌నెస్ చూసి ఆగిపో



యాడు. "ఏం?"అని మాత్రం అన్నాడు. ఏ కారణం చేతైనా ఆమె ఇప్పుడు నటించటం ఆపేస్తే ఎంత ఇబ్బంది పడాలో అతనూహించగలడు. "నీకు తెలుసు, ఇండస్ట్రీలో బతకటానికి ఎంత కష్టపడాలో, ఎన్ని అవమానాలు ఎదుర్కుంటే ఇక్కడికొచ్చామో? అలాంటి నాకే ఈ సీరియళ్ళలో నటిస్తుంటే మనుషులమీద నమ్మకం పోతోంది. కనీస మానవ విలువలు లేని కారెక్టర్లు, నిస్సహాయతని, బలహీనతలని సానుభూతిగా చూపెట్టే రచనలు. ఇలాంటి వాటికి భయపడి క్లైమాక్స్‌లో నేనాత్మహత్య చేసుకోవడం నాకు నచ్చలేదు" ఆమె మాటల్లోని వ్యతిరేకభావం విన్న శరత్ ఆశ్చర్యపడ్డాడు. అప్పుడప్పుడు ఆమె అంటుండేది "ఇవీ సీరియళ్ళేనా?" అని కానీ ఇంత అసహ్యం ఉందన్నవిషయం మొదటిసారి తెలిసింది.



తనే మళ్ళీ అంది "నేను బాగా నటిస్తానే పేరయితే వచ్చింది కానీ ఈ రొటీన్ చవకబారు సీరియళ్ళలోనటించి నాకు విసుగొచ్చింది. నారిలేషన్స్ మీద నమ్మకం పోతోంది" అంది.

"చవకబారు" అన్న మాటని ఉపయోగించినందుకు హర్టయ్యాడు శరత్" అంటే నేరాసినందంతా "చెత్త" అనేనా నీ ఉద్దేశం" అన్నాడు.

మాలిని మాట్లాడలేదు. "ఏం మంచి లేకుండానే నా సీరియల్స్ టాప్ రేటింగ్స్‌లో నిలబడతాయా?" అన్నాడు. నిజానికి అతనికీ తెలుసు, ఏం రాయాలనుకున్నాడో? ఏం రాస్తున్నాడో"

"ఏం మంచి ఉంది శరత్, నీ సీరియళ్ళలో చెప్పు. రేటింగ్స్‌లో టాప్ పొజిషన్‌లో వుండటం, ఎక్కువమంది నీ సీరియల్ చూడటం. ఈ కారణాలవల్ల నీ సీరియల్ మంచిది అనుకుంటే అది నీ ఫూలిష్‌నెస్. నీ మొదటి సీరియల్ 'బానిస' ఇద్దరు పెళ్ళాల కథ. మొగుడు వద్దన్నా అతన్నే పట్టుకువేళ్ళాడే బానిసల కథ. రెండో సీరియల్ 'కుటుంబం' ఒక్కరు కూడా మరొకరిని నమ్మని గొప్ప కుటుంబం. మొగుడి మీద పెళ్ళానికి, అత్తమీద కోడలికి, తల్లిమీద కొడుక్కి అపారమైన అనుమానం. ఇప్పుడు 'పతివ్రత' శారీరకంగా చెడిపోకుండా తన అన్ని బలహీనతలకి మంచితనం మునుగేసుకున్న ఓ అబలకథ. నీకు హ్యాట్సాఫ్ శరత్. ఆడవాళ్ళ బలహీనతని అద్భుతంగా క్యాష్ చేయగలిగే నీ టాలెంట్‌కి" అంది మాలిని. ఆమెనే చూస్తున్న శరత్ ఆశ్చర్యపోయాడు. ఎంతగా అంటే కొద్దిసేపు మాట్లాడలేదు. ఒక్కసారిగా అన్ని నిజాలే మాట్లాడితే తనేం చెప్పగలడు. చివరికి అన్నాడు.

"మరైతే ఏం రాయమంటావు?" మంచే రాస్తాం, అంతా మంచే రాస్తాం! నువ్విలా వుండు. నువ్వా తప్పు చేయకు అంటూ ప్రవక్తల్లాగ బోధిస్తాం. ఎంతమంది చూస్తారు? ఎన్ని రోజులు చూస్తారు. ప్రజలు టీవీ చూసేది వినోదం కోసం, నీతిపాఠాలకోసం కాదు" చిన్నగానే అన్నాడు కానీ కరుగ్గా అన్నాడు.

"కరెక్ట్,వాళ్ళు చూసేది వినోదంకోసం, ఒప్పుకున్నావ్ గదా" అతను రావాల్సిన పాయింట్‌కే వచ్చినట్టే అంది. "వినోదం ఇవ్వాలి కానీ, ఏడుపులూ, పెడబొబ్బలూ, అనుమానాలూ, హత్యలు, పగలు, ప్రతీకారాలూ, రంకులు, బొంకులు ఇవి కాదు వాళ్ళకి కావాల్సింది. ఒక భర్త, భార్యతో ఎంత బాగా ఉండొచ్చో, ఒక పిల్లవాడితో తల్లిదండ్రులు ఎంత స్నేహంగా వుండొచ్చో, అత్తా, కోడలి రిలేషన్ ఎంత గమ్మత్తయిందో, ప్రియుడు తన ప్రేయసిని ఎంత బాగా ప్రేమించొచ్చో, చుట్టూ ఉన్నవాళ్ళతో మన అనుబంధం ఎలా ఉండాలో- ఇవన్నీ చాలా సహజమైన విషయాలు. వీటన్నింటినీ ఎంత వినోదాత్మకంగాచెప్పొచ్చో ఆలోచించు.ఇవి చెప్పడానికి కూడా ఒక తండ్రి-తల్లి, అత్తా-కోడలు, భర్త-భార్య, ఒక కుటుంబం కావాలి గానీ ప్రవక్తల్లో, మత గురువల్లో కాదు. ఇదంతా చేయడానికి నువ్వు కొత్తగా కష్టపడాల్సిందేమీ లేదు. ఇప్పుడు రాసేదే రాయి. కానీ నెగటివ్‌గా కాదు, పాజిటివ్‌గా" అంతా విని ఆలోచించాడు, తల పగిలిపోయేలా ఆలోచించాడు. తరువాత నవ్వుకున్నాడు. అతన్ని చూస్తూ అంది మాలిని "ఇదంతా మాకు తెలీనట్టూ మేం ఆలోచించనట్టూ చెబుతుంది" అని నవ్వుకోకు శరత్" అంది. అదిరిపడ్డాడు శరత్. ఆక్షణం నిజంగా అలాగే అనుకుంటున్నాడు.

"నేను చెప్పేది సులభం కాదు, కానీ కష్టమూ కాదు. కష్టపడే ధైర్యం లేక అందరి దారిలో నువ్వూ నడుస్తున్నావు. కానీ కొత్తదారిని కనిపెట్టేది ఎవరో ఒక్కరే. మిగతా అంతా అతన్ని ఫాలో అవుతారు. నువ్వు వెనకే ఉండాలనుకుంటున్నావో, ముందుకొస్తావో నీ యిష్టం. వెళ్తా మరి" అంటూ లేచింది మాలిని.

తుఫానులా వచ్చి వెళ్ళిపోతోంది. ఎందుకొచ్చిందో, ఎందుకెళ్తుందో అర్థం కాలేదు. "నేను నిజంగా ఈ పని మీదే వచ్చాను. కానీ నీవల్ల కాదని తెలిసిపోయింది. అందుకే వెళ్తున్నాను" అంది. మళ్ళీ తెల్లబోయాడు శరత్. మనస్సులో మెదులుతున్న ప్రతి ప్రశ్నకి సమాధానం చెప్పింది ఈరోజు. "వెళ్తాను" అంటే యాంత్రికంగా డోర్ వరకూ నడిచి సాగనంపాడు. బయటికి వెళ్ళాక వెనక్కి చూసి నవ్వి, చీకట్లో కలిసిపోయింది. ఆ నవ్వుకి అర్థం అప్పటికి తెలీలేదు. ఆ తర్వాత స్పృహ కోల్పోయేవరకూ తాగాడు శరత్. నిజాల్ని జీర్ణించుకోలేక.

తెల్లవారుఝామున ఫోన్ ఆగకుండా మోగుతుంటే లేచాడుశరత్. ఫోన్‌చేసింది ఏడుకొండలు.అతడు చెప్పిన విషయం విన్న తర్వాత పూర్తిగా మత్తు వదిలింది శరత్‌కు-

"మాలిని చనిపోయింది".

కలో, నిజమో అర్థం కాని స్థితిలో అప్రయత్నంగా అడిగాడు, "ఎప్పుడు? ఎలా?"

"నిన్న సాయంత్రం క్లైమాక్స్ షూటింగ్‌లో కొండ చివరినుంచి పడిపోయింది. ఏం జరిగిందో తెలీదు. కావాలనే దూకిందని కొందరు, కాదు ఏక్సిడెంట్ అని కొందరంటున్నారు. వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. రాత్రి ఏడున్నరకి చనిపోయింది". వింటున్న శరత్‌ఉ లిక్కిపడ్డాడు. సరిగ్గా అప్పుడే తన దగ్గరికి వచ్చింది మాలిని. "మీరు చెప్పేది నాకర్థం కావట్లేదు" అన్నాడు.

"నాకు ఎనిమిదింటికి తెలిసింది, నీకు ట్రై చేస్తే రింగవుతుంది కానీ ఎవరూ లిఫ్ట్ చేయట్లేదు. డెడ్ అయ్యిందనుకుంటాను!" అంటూ ఏదో చెప్తున్నాడు. కానీ శరత్‌కి ఏమీ వినబడట్లేదు. అప్పటికే మత్తు లేకుండానే మరోసారి స్పృహ కోల్పోయాడు. ●